# మాజో మనిషి

## ఇచ్ఛాపురపు జగన్నాథ రావు

బయట చినుకులు పడుతున్నాయి. చల్లటిగాలి వీచుతోంది. శ్రీధర్ గుండెలమీద వాలి వుంది మమత. కొనవేలితో అతని చెక్కిలిమీద గీతలు గీస్తుంది. అతనివేళ్ళు ఆమెని అల్లరిచేస్తున్నాయి.

అలాగ పది నిమిషాలు. ఇద్దరూ మాట్లాడలేదు. ఛేపు సంగీతం చిన్నగా వినిపిస్తోంది.

ఒకరి గుండెలు మరొకరి గుండెలతో కలిసి మందంగా తాళం వేస్తున్నాయి. తాను దగ్గరగా రాగానే అతని గుండె వేగంగా కొట్టుకోవడం ఆమె గమనించి సంతోషపడుతుంది. ఆ తరువాత సంతృప్తి కలిగిస్తూ ఆ స్పందన వేగం తగ్గుతుంది. సరిగ్గా అదే అనుభవం అతనికి ఆనందం ఇస్తుంది.

ఆమె సున్నితంగా అతని చేతులు తొలగించబోయింది. అతను అంత సున్నితంగానూ వారించి "ఏం?" అన్నాడు.

"వంటచెయ్యాలి. ఏడయింది" అంది మమత.

"చెయ్యకపోతేనేం?"

"ఆకలి వేస్తుంది."

"నిన్ను చూస్తూంటే... ఆకలివెయ్యదు దాహం వెయ్యదు!"

"నాకు వేస్తుంది. మీరు తినకపోతే మరీ వేస్తుంది."

"అద్దం చూసుకో."

"మిమ్మల్ని చూస్తే చాల్లెండి వొదలండి ప్లీజ్!"

"నో. నాకిలాగ బాగుంది."

"రాత్రి అంతా వుందిగా! మన పెళ్ళి ముహూర్తం ఉదయం మూడున్నరకి."

"జ్ఞాపకం వుంది. నిద్దరకళ్ళు. నువ్వు హాయిగా తల వొంచుకుని నిద్ర లాగించేశావు."

"అన్నీ అబద్దాలు! మీరు నిద్రపోతే లేపడం కష్టమైందిట."

"పచ్చి అబద్ధం! అసలు నేను నిద్రపోతేకదా! ఆ తొలినాడు జరిగినది మరిచిపోదామని ప్రయత్నిస్తూ తెలివిగానే వుండిపోయాను."

"కళ్యాణి ఎంత అల్లరి చేసింది! రాస్కెల్ అది చిన్నపిల్ల అనుకున్నాను—దాని పెళ్ళికి అసలు వొడ్డీలతో బాకీ తీర్చకపోతానా?" అంది మమత.

"నిజంగా నీకోపం వచ్చిందా?"

"రాక? నిన్ను బావగారు అర్జెంటుగా మామిడితోటలో కలుసుకొమ్మన్నారు. లేకపోతే కొంపలు మునుగుతాయిట! ఎవరికీ — ఎవ్వరికీ చెప్పొద్దన్నారు అని కబురు తెస్తుందా? ఎంత భయపడుతూ వెళ్ళానో! తలుచుకుంటే ఇప్పటికీ—"

"తెలుస్తోంది నాకూ అలాగే చెప్పింది. నేనైతే సంతోషంగా వొచ్చేశాను— నన్ను తనే తీసికెళ్ళింది పాపం!"

"దాని మీద మీరేమీ జాలిపడక్కరలేదులెండి. పసిడి గులాబీ అది. ముట్టుకునే దాకానే దాని సుకుమారం!"

"పసిడి కూడా కరిగే రోజు వొస్తుందిలే! ఆరోజు నేను కళ్యాణికి గొప్ప బహుమతి ఇస్తాను" అన్నాడు శ్రీధర్.

గడియారం ఒకసారి కొట్టింది.

"ఏడున్నర! ఇంక వెళ్ళనివ్వండి" అంది మమత.

"ఆ రాత్రీ సరిగ్గా ఏడున్నరకే నువ్వూ నేనూ..."

"పోకిరీ మనుషులు మీరు!" అని లేచింది మమత. అతను ఆమెను ఆపే ప్రయత్నంలో లేడు. అతని మనసు ఎక్కడో వుంది.

"ఇలాంటి మధుర క్షణాల్లో కూడా వొంటా, గిన్నెలూ నీకెలా జ్ఞాపకం వొస్తాయి?" అన్నాడు శ్రీధర్.

"అనుభవం. ఈ రోజుతో రెండేళ్ళ సర్వీసు పూర్తి. ప్రొబేషన్ ముగిసింది."

"ఆఫీసు మాటలు ఇంట్లో వొద్దు."

"ఇవి ఇంటి మాటలే!"

"అయితే ఇంక కన్ఫర్మేషన్ ఇవ్వాలి."

ఈ సారి ఆమె పరధ్యానంగా వుంది. అతనికి దొరికిపోయింది. ఇద్దరూ మంచంమీద పడ్డారు.

బయట వర్షం నిలకడగా పడుతూ మధ్య మధ్య జల్లు వొస్తూంది. సగం తీసిన కిటికీలోనించి జల్లు వొచ్చింది.

"వొదలండి, కిటికీ వెయ్యాలి."

"వొద్దులే."

ఆమెకీ కదలాలనిపించలేదు. ఎవరూ మాట్లాడని కొద్ది నిమిషాల ఆత్మానందం ఎవరో తలుపు తట్టడంతో చెరిగిపోయింది.

"ఎవరు?" అందామె.

"తెలీదు..."

"చూడండి"

అతను లేచి బట్టలూ, తలా సరిచేసుకుని "కొంప తీసి... " అన్నాడు

ఆమె ముఖంలో నిరాశా భయమూ కనిపించేయి.

"ఏమో! చెప్పలేం" అంది.

ఛేపు ఆగింది. షహనాయ్ మరి వినిపించలేదు. అతని ముఖంలో ప్రశాంతిపోయింది. ఆమె ఇబ్బందిగా చూసింది.

శ్రీధర్ వెళ్ళి తలుపు తీశాడు. టెలిగ్రాం. శుభాకాంక్షలు. అంత వర్షంలో ఆ టెలిగ్రాం తెచ్చిన వాడిని మెచ్చుకుని లోపలికి వెళ్ళాడు శ్రీధర్. మమత ఆత్రంగా చూసి కళ్ళతో ప్రశ్నించింది.

టెలిగ్రాం చూపించాడు శ్రీధర్.




"ఎవరినుంచి?"

"మీ చెల్లెలు."

మమత నవ్వి "అది మరిచిపోదు! స్వీట్‌గాల్" అంది.

"రాస్కెలన్నావు"

"స్వీట్ రాస్కెల్"

ఆ తియ్యటి ఏకాంతం కరిగిపోయింది. కాల్‌బెల్ ఒక్కటే కాదు—అతని మనసులోని మాటని బయట పెడుతూ ఆమె "నిజంగా చిరంజీవిఅనే అనుకున్నాను" అంది.

"నేనూను... థేంక్ గాడ్" అన్నాడతను.

వెచ్చటి ఆ గదిలోకి మూడోమనిషి వొచ్చేసినట్టు అయింది. కనిపించని మూడో మనిషి.

"కిందటేడు—" అంది కణతలు నొక్కుకుంటూ మమత.

అప్పటికి ఒకటి రెండు నెలల ముందరే చిరంజీవి వాళ్ళకి పరిచయం అయ్యాడు. శ్రీధర్ ఆ ఊరు వొచ్చిన కొత్తరోజులవి. కోరి అతను ఊరికి కాస్త అవతల వున్న ఇల్లు తీసుకున్నాడు. పది చెట్లు ఉండడాన్నీ పొరుగు ఇళ్ళు కాస్త దూరంగా వుండడాన్నీ అతనికి ఆ ఇల్లు నచ్చింది. అద్దె కూడా చాలా న్యాయంగా వుంది. ఆ పరిస్థితిలో అడ్వాన్సు ఇచ్చి వొస్తుంటే స్కూటరు పక్కన నిలబడి వున్నాడు చిరంజీవి. శ్రీధర్‌కి నమస్కారం చేసి తాను ఎక్కడ పనిచేస్తున్నదీ చెప్పి లిఫ్ట్ అడిగాడు.

అప్పటికి శ్రీధర్ వాళ్ళ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో వుంటున్నాడు. అక్కడ దింపేస్తే చాలునన్నాడు చిరంజీవి. పది నిమిషాలలో అక్కడికి చేరేరు. దిగి, "మీరు రామనాథం గారి ఇల్లు తీసుకుంటున్నారా?" అన్నాడు.

"అలాగ ప్రారంభం అయింది. ఆ ఇంటిని గురించి చెప్తూ ఆగి "మీరు అడ్వాన్సు ఇచ్చేశారా?" అన్నాడు చిరంజీవి.

"ఇచ్చేశాను ఏం?" అన్నాడు శ్రీధర్.

"ఏమీలేదు ఏమీ లేదు. మరీ ఒంటరిగా వుంటుందని. మీ ముందు మా ఫ్రెండు పీతాంబరంగారు అక్కడ వుండేవారు. ఆయన ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనరులెండి. నేనంటే పాపం మా చెడ్డ అభిమానం. చిరంజీవి! ఈ ఇల్లు బాగానే వుందిగానీ ఏమిటో బాగులేదోయ్! అంటూ వుండేవారు. ఆయనది చాలా సెన్సాఫ్ హ్యూమర్‌లెండి. టాక్సు వసూలు చెయ్యడం అంటే పన్ను పీకినంత కష్టం అంటూ వుండేవాడు. గమనించారా? టాక్సు అన్నా పన్నేకదా!" చిరంజీవి చాలా సేపు నవ్వేడు.

అతను వెళ్ళలేదు. లాంఛనంగా మర్యాదకోసం శ్రీధర్ అతన్ని లోపలికి రమ్మన్నాడు. ఒకసారి వాచీ

చూసుకుని "ఆరున్నరకి ఒకచోటికి వెళ్ళాలండీ! కాని మీ మాటే కానివ్వండి" అంటూ చిరంజీవి లోపలికి వచ్చేడు. శ్రీధర్ లోపలికి వెళ్ళి మమతతో చెప్పి వొచ్చాడు.

"అన్నగారూ! మీరా ఇంట్లో ఏమీఅసౌకర్యంపడొద్దు. మంచి పనిమనిషిని చూసిపెడతాను. పొద్దుగునుంచి పిండి ఇచ్చే పాలవాడి వాడిక ఏర్పాటు చేస్తాను..." అన్నాడు చిరంజీవి.

"మీకెందుకండీ శ్రమ? మా ఆఫీసు మనిషి వుంటాడు" అన్నాడు శ్రీధర్. మమత కాఫీ తెచ్చింది. ఆ మాట మళ్ళీ చెప్పి "మీకు శ్రమవొద్దు—ఆఫీసు వాళ్ళు ఏం చెయ్యగలరండీ? మాది ఈ వూరే. నాకన్నీ తెలుసును..."అంటూ మమతతో మాట కలిపేడు.

తరవాత పనిమనిషీ, పాలవాడు అన్ని విషయాల లోనూ సహాయం చెయ్యడంతో కొంత ఇబ్బంది కలుగ జేశాడు చిరంజీవి. ఎలాగో అన్నీ సర్దుబాటు అయ్యాయి.

అతను తరుచుగా రావడం మొదలు పెట్టాడు. నలుగురు పిల్లలుట అతనికి. భార్యకి తరచుగా ఒంట్లో బాగుండదట. అన్నగారూ మీ ఇల్లు నందనవనంలాగా వుంటుంది. అసలు నేనెవరి ఇళ్ళకీ వెళ్ళను. ఎవరితోనూ పరిచయం పెంచుకోడానికి నాకు వ్యవధీలేదు, కోరికా లేదు. కాని, మీ ఇద్దరినీ చూస్తోంటే ఎక్కడా కలగని ఆనందం నాకు!" అనేవాడు చిరంజీవి. మమతకి కూడా ఉద్యోగం వచ్చేక వాళ్ళిద్దరూ వీలైనన్ని సాయంకాలాలు ఎక్కడికైనా వెళ్ళిపోయేవారు. కాని, ఆ ఇద్దరికీ హోటల్ తిండి పడదు. వంటకి మనిషిని పెట్టుకోవడం అనవసరం ఖర్చుగా కనిపించింది.

తిరగడంతో అలిసిపోయి ఇంట్లోనే వుండిపోతే చిరంజీవి టెలిగ్రాఫ్ అందినట్టు వొచ్చేవాడు. పరస్పర సాన్నిహిత్యం కోరుకుంటూన్న శ్రీధర్ మమతలకు చిరంజీవి చాలా పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు.

అతను దర్శనం ఇవ్వని సాయంత్రాలు విలువ చాలా ఎక్కువ అయిపోయింది. శ్రీధర్ వొచ్చేసరికి మమత స్నానం చేసి టిఫిన్ సిద్ధం చేసేది. తిని గంటసేపు ఒకరి దగ్గర ఒకరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గడపడం వారు కోరుకునే వరం. వారంలో ఒకసారి కాని, రెండు సార్లుకాని ఇది సాధ్యం అయేది. ఆ రోజుల్లో కూడా వాళ్ళిద్దరూ భయంగా అటూ ఇటూ చూస్తూనే వుండే వారు. రాత్రి భోజనాలయి పడక గదిలో చేరేక మాత్రమే వాళ్ళది చాలా వరకూ నిజమైన ఏకాంతం.

ఈ మనిషిని ఎలాగ విడిపించుకోవాలో అని ఆలోచనలు చేసి చేసి ఆ దంపతులు కొన్ని చర్యలు తీసుకోక పోలేదు. కాని, అవి విఫలమయాయి.

ఒకసారి అతనికి టిఫిన్ పెట్టి మమత "మీరు ఈ టైమ్‌లో ఇంటికి వెళ్ళకపోతే మీ శ్రీమతి ఏమీ అనుకోరా?" అంది.

"అనుకుంటుంది. చాలా మంచి పని చేశానని అనుకుంటుంది" అన్నాడు చిరంజీవి.

"అదేమిటి? పిల్లలు మీకోసం చూడరా?" అంది మమత.

"వాళ్ళా? ఏ వీధిలో ఏ చెట్టు మీదనో, రోడ్ల మీదనో వుంటారు. ఇంక మా ఆవిడ! పాపం దానికి వాళ్ళని రిసీవ్ చేసుకునే సరికి అలసటవొచ్చేస్తుంది. నేనూ ఇంటికి చేరితే అది మరొక భారం..."

"మీరు మా మంచి చెడ్డలు చూస్తుంటే వాళ్ళంతా మీమీద కోపం తెచ్చుకుంటారనుకున్నాను... మీ తీరిక అంతా మాతో గడపడం మాకెంత సరదాగా వున్నా వాళ్ళేమనుకుంటారోనని..."అని నసిగింది మమత.

"భలేవారండీ!" అని నవ్వేశాడు చిరంజీవి. "కావలిస్తే ఒకవాడు వాళ్ళందరినీ తీసుకొస్తానులెండి. మీలాటి వారిని చూసి ఆవిడా కొంతనాజూకూ, మేనర్సూ నేర్చుకుంటుందేమో! అలాటివి చూస్తే వొస్తా యని కాదుగాని ప్రయత్నం చెయ్యడంలో తప్పేమీ లేదు! ఏమంటారు?"

"ప్రయత్నం చెయ్యడం మంచిదే!" అంది మమత నీరసంగా.

"మీ గార్డెనూ ఈ చెట్లూ చూసి నా పిల్లలు పొంగిపోతారు! చెట్లెక్కడం వాళ్ళకి బలే సరదాలెండి! అసలు మీకు పిల్లలంటే సరదా అనుకుంటాను. ఏం?" అన్నాడు చిరంజీవి.

"సరదా అంటే..."

"నాకు తెలుసును. ఒకనాడు — ఒకనాడేమిటి? మీరు బయటివారా? తరుచు తీసుకొస్తాను. భలే అల్లరి పిల్లలు లెండి. కాముడు — అదే మా ఒక్క ఆడ పిల్లనూ — వాళ్ళ అన్నదమ్ములతో సరిగ్గా చెట్లెక్కి, గోడలు గెంతి ఆడుతుంది. దాన్ని టాంబోయ్ అంటాం! వెధవలకి స్కూల్లో చదువులు రావన్న మాటే గాని మంచి చురుకైనా వాళ్ళు!"

మమత గుండెల్లో రాళ్ళు పడ్డాయి.

"చాలా మంచి ఆలోచన! నేను ఏర్పాటు చేసి చెప్తాను. అప్పుడు వాళ్ళందరినీ మీరు తప్పక తీసుకు రావాలి!" అంది.

"ఏర్పాట్లెందుకండీ! వాళ్ళకోసం మీరు ప్రత్యేకంగా ఏమీ చెయ్యవద్దు. మనలో మనకి లాంఛనాలేమిటే? అసలు మా పిల్లలు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క పేకెట్ బిస్కట్లు కొట్టేస్తారు. అవిచాలు!" అన్నాడు చిరంజీవి.

ఆ తరవాత మమత ప్రతీ ఆదివారమూ ఉదయం నుంచీ భయపడుతూనే గడిపేది. కాని ఏమి కారణమో ఆ దండయాత్ర జరగలేదు. కారణం ఏమిటని ఆ దంపతులు ఎప్పుడైనా ప్రశ్నించుకునేవారు. కాని, చిరంజీవి ముందర ఆ విషయం రాకుండా చాలా జాగ్రత్త పడేవారు.

మరొక సాయంత్రం ఆరున్నర టైములో వొచ్చాడు చిరంజీవి.

"సారీ చిరంజీవిగారూ! ఇవేళ నేనూ ఆవిడా సినిమాకి వెడదామని బయలుదేరుతున్నాం" అన్నాడు శ్రీధర్.

"గుడ్. ఏ సినిమా?"


"ఇంకా నిర్ణయించుకోలేదు."

"మంచి హిందీ పిక్చరుంది. కమల్‌లో — నేను వెళ్ళి టికెట్లు తీసి వుంచుతాను. పదినిమిషాలలో మీరు వచ్చేయండి."

"ఒద్దండీ! మీకు శ్రమ..."

"ఏం ఫరవాలేదు. కావాలంటే మూడు టికెట్లు తీస్తాను. నేనూ చూస్తాను. చాలాకాలం ఐపోయింది..." అన్నాడు చిరంజీవి సంతోషంగా. అతనిది పసివాడి మనస్తత్వం అనిపించింది శ్రీధర్‌కి. కాని మమతకి అలాగ అనిపించలేదు. ఆమె విసుక్కోవడం శ్రీధర్‌కి కొంత బాధ, ఆశ్చర్యమూ కలగజేసింది. ఈ రకం దండయాత్ర ఆమెకి ఎంత బాధాకరమో తనకీ కనీసం అంతేకదా! కాని ఉన్న సంగతి ముఖం మీద అనేసి అతన్ని చిన్నబుచ్చడం తమ ఇద్దరికీ చేతకాదు. అదీకాక వొచ్చి కూర్చోడం తప్పితే చిరంజీవినష్టమేమీకలిగించడంలేదు. కాఫీ టిఫినూ ఇస్తే సంతోషంగా స్వీకరిస్తాడు. ఇవ్వక పోయిన రోజు అరుదు. కాని ఆరోజు కూడా అతను అడగడు. "ఇంట్లో రోజూ తింటామూ అన్నగారూ? ఉప్పుపిండి చేసినా ఒక్కొక్కప్పుడు మిగలదు. అందుకే నాకేదీ అలవాటులేదు" అనేవాడు చిరంజీవి.

అలాంటి వాడిని అవమానపరచడం శ్రీధర్‌కీ



మమతకీ కూడా చేతగాని పని అవడంతో ఆశ్చర్యం లేదు. కాని, గాఢమైన ప్రేమలో వున్న మనుషులు వాళ్ళు. వాళ్ళు కోరుకునేది ఏకాంతం. వాళ్ళు బతికి వుండేది, ఊపిరితీసేది ఒకరికోసం ఒకరు. ఆమె ఉద్యోగంలో చేరడం కూడా కేవలం ఆదాయం కోసమే కాదు. తొమ్మిదిన్నరనుంచి ఐదున్నరదాకా ఒక్కతీ ఇంట్లో వుండి అతనికోసం ఎదురు చూడడం ముందర తియ్యటి బాధగా వుండేది. క్రమంగా వారిద్దరి మధ్యా ఆప్యాయతా, అనురాగమూ ప్రేమగా విజృంభించాక ఆ ఎదురు చూడడం భరించలేనివేదన అయిపోయింది. అందుకే ఉద్యోగం.

ఆ ఇద్దరి మధ్యా ఈ చిరంజీవి సినిమా టిక్కెట్లు తీస్తానంటూ.

శ్రీధర్‌కి మెరుపులాటి ఒక ఆలోచన వొచ్చింది.

"చూడండి చిరంజీవి! మీరు నాకొక ఉపకారం చేసి పెట్టాలి" అన్నాడు శ్రీధర్.

"చెప్పండి అన్నగారూ!" అన్నాడు చిరంజీవి.

"మీరా హిందీ సినిమాచూసి ఎలావుందో చెప్పాలి."

"మీరే చూడకూడదూ?" అన్నాడు చిరంజీవి.

"ఆవిడకి ఇవాళ తలనొప్పిగా వుందిట. మా ఇద్దరికీ హిందీరాదు. మీరు చూసి మంచివెద్దలు చెప్తే రేపు వెళ్ళడమో మానడమో చేస్తాం. కాని మీరు ఆ ఉపకారం చేయాలంటే ఒక్క షరతు."

"ఏమిటండీ అది?"

"సినిమా నా ఖర్చుమీద చూడాలి. మా కోసం."

"దానికేముందీ! అలాగే చేద్దాం" అన్నాడు చిరంజీవి.

డబ్బు చేతిలో పెట్టి చిరంజీవిని త్వరపెట్టి పంపించేశాడు శ్రీధర్. ఆ సాయంత్రం తనదే అనుకున్నాడు. మమత తన చిరాకు నించి కోలుకోడానికి కొంత వ్యవధి పట్టింది. కొంతసేపటిదాకా ఆమె నవ్వలేక పోయింది.

ఆమె నవ్వుతూంటే చిరంజీవి తలుపుకొట్టేడు.

టికెట్ దొరకలేదుట. తిరిగి వొచ్చేశాడు.

అలాగ సాగింది. చివరికి ఆ ఊరు నించి బదిలీ చేయించుకోవడం ఒకటే మార్గం లాగ కనిపించింది ఆ జంటకి. ఈలోగా కొన్ని డైరెక్టు అస్త్రాలు దంపతులిద్దరూ వేరుగానూ, కలిసీ ప్రయోగించారు. కాని అవేవీ పనిచెయ్యలేదు. కాని బదిలీ చేయించుకోడం శ్రీధర్‌కి సులువుకాదు. ఆమెకి అసలే కుదరదు.

వాళ్ళిద్దరిదీ మొదటి కళ్యాణ దినోత్సవం ఎలాగ జరిగిందో మరపురాదు. ఆ ప్రత్యేక దినంకోసం వాళ్ళు చాలా ఎదురుచూశారు. వారిద్దరూ కోరుకున్నదీ ఏమీ ఎక్కువకాదు — ఒకరితో ఒకరు హాయిగా కూర్చుని ఆల్బమ్ తిరగవేస్తూ ఆనందంగా కబుర్లు చెప్పుకోవాలని. ఆ రోజు ఆదివారం అవడం అదృష్టం అనుకున్నారు. కాని అది త్వరగానే దురదృష్టం అయింది. మరి చిరంజీవి వాళ్ళ వెడ్డింగ్ ఆల్బమ్ చూశాడు కదా! ఆ ఉదయం రెండు ఆపిల్ పళ్ళూ, ఒక చేమంతి పువ్వూ తెచ్చిఇచ్చి వాళ్ళకి శుభాకాంక్షలు చెప్పేడు. అక్కడిదాకా బాగానే వుంది.

"ఈరోజు పుణ్యదినం. మీరు మా ఇంటికి భోజనానికి రావాలి" అన్నాడు చిరంజీవి.

మమతా శ్రీధర్ ఒకరివేపొకరు చూసుకున్నారు. వాళ్ళ గుండెల్లో రాళ్ళ వర్షం. జరగబోయేది ఇద్దరూ ఊహించుకున్నారు.

"మీరు ఆవిడని అలాగ బాధ పెట్టడం తప్పు. వెంటనే వెళ్ళి మేము రాలేం అని చెప్పెయ్యండి!" అన్నాడు శ్రీధర్.

"ఆవిడతో చెప్పలేదు నేను. అటు. ఆవిడకీ ఇటు మీకూ కూడా సర్ప్రయిజ్ ఇద్దామనుకున్నాను. ఫరవాలేదు. గంటలో వంట పూర్తి అవుతుంది రండి" అన్నాడు చిరంజీవి.

కొంత తేలిక పడ్డాడు చిరంజీవి.

"మీరు చెయ్యలేరని కాదు. మేము గుడికి వెళ్ళి అలాగ తిరిగి వొద్దాం అనుకుంటున్నాం" అంది మమత.

"దానికేం! అలాగే చెయ్యండి. నేనూ మీతో వస్తాను. కాని ఇవేళ నాతో మీరు భోజనం చెయ్యాలి" అన్నాడు చిరంజీవి.

చివరకి హోటల్లో అతనూ వాళ్ళిద్దరూ తిన్నారు. ఆ రోజు జ్ఞాపకం ఇంకా కొత్త గాయంలాగే వుంది. ఆ తరవాత ఆరేడు నెలలకి చిన్న సంఘటన జరిగింది.

ఆ సాయంత్రం కొంచెం త్వరగా వొదిలేడు చిరంజీవి. మమతా, శ్రీధర్‌యు కొంచెంసేపు కబుర్లు చెప్పుకుని భోజనానికి ఉపక్రమిస్తూంటే కాల్ బెల్ వినిపించింది. చిరంజీవి.

"నాకు అర్జెంటుగా రెండు వందలు కావాలి. అప్పుగా. తొందరగా తిరిగి ఇచ్చేస్తాను" అన్నాడు అతని ముఖంలో ఆత్రం. ఏమిటి సంగతి అని అడగాలనిపించింది. భార్యకి జబ్బా? పిల్లలకా? వాళ్ళకి ఫీజు కట్టాలా? ప్రమాదం జరిగిందా? ఏమిటి?

కాని లోపల తొందర.

అతను త్వరగా వెడితే చాలు అని ఆలోచన.

మమత రెండు నూరు నోట్లు తెచ్చి శ్రీధర్‌కి ఇచ్చింది. అతను అవి చిరంజీవికి ఇచ్చిన వెంటనే అతను సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు అతను రాలేదు.

ఆ మర్నాడూ, ఆ మర్నాడూ, ఆ వారం, ఆ నెలా...... ఈ నెలన్నీ.

ముందర ఆ మాట ఎవరూ ప్రస్తావించలేదు. ఏదో ఒకరోజు చిరంజీవి "అన్నగారూ" అంటూ హటాత్తుగా దిగుతాడని వాళ్ళ గట్టి నమ్మకం. అలా జరగకుండా వారాలూ, నెలలూ గడుస్తున్న కొద్దీ వాళ్ళ భయం బలపడుతూ వచ్చింది.

ఈ రోజు దాకా.

"కిందటేడు"—అంది రాధ కణతలు నొక్కుకుంటూ.

"చిరంజీవి చిన్నపిల్లాడి లాటివాడు— నీకూ తెలుసును. నువ్వు క్షమించేశావనీ తెలుసును" అన్నాడు శ్రీధర్.

"మీరూ అంతే"

"అవును. ఆ సాయంత్రం అతను డబ్బు పట్టికెళ్ళేక మళ్ళీ కనిపించలేదు ఏమయాడో!" అన్నాడు శ్రీధర్.

"అసలా అవసరం ఎందుకొచ్చిందో?" అంది మమత.

"మనం అడగనేలేదు."

"వొదిలితే చాలు అనుకున్నాం."

"అవును... అంతకు ముందు తనెప్పుడూ డబ్బు అడగలేదు."

"హౌస్ ఫుల్ అని నేనిచ్చిన డబ్బుకూడా తిరిగి ఇచ్చేశాడు."

ఇద్దరూ ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు. బయట వర్షం తగ్గిపోయింది.

"అప్పు ఇస్తే స్నేహం పోతుందంటారు" అంది మమత.

"అందుకే అంత తొందరగా ఇచ్చేము" అన్నాడు శ్రీధర్.

వాళ్ళిద్దరి మధ్యా మళ్ళీనిశ్శబ్దం చోటు చేసుకుంది. గడియారం ఎనిమిది కొట్టింది.

శ్రీధర్ లేచి "త్వరగా తయారవు. డిన్నర్‌కి పోదాం" అన్నాడు.

"ఇంట్లో వండేస్తాను—ఈ వర్షంలో బయటికెందుకూ?" అంది మమత.

"వర్షం తగ్గింది. కారు తెప్పిస్తాను. నువ్వు త్వరగా

## దివ్వెల నవ్వులు

దీపాలను వెలిగించండి!
చీకట్లను తరిమేయండి!
ద్వేషాలను మత్సరాలను
మనసునుంచి వెలివేయండి!

ఆనందం కావాలంటే
అనురాగం చిలికించండి!
బంధనాలు తొలగాలంటే
జ్ఞాన వీణ పలికించండి!

గగనంలో తారావళిని
హృదయంలో దీపావళిగా
చేయటమే నరకాసుర వధ!
'సత్య'భామ రణకేళీ కథ!

ఆశయాలు నడిచే దివ్వెలు
అక్షరాలుపలికే దివ్వెలు
జీవితాలు ఆడే దివ్వెలు
మీరంతా దివ్వెల నవ్వులు!!

- ఆచార్య తిరుమల.

రడీ అవు..."

శ్రీధర్ ఆఫీసుకి ఫోన్ చేసి కారు పంపమన్నాడు. త్వరగా బట్టలు మార్చుకుని సిద్ధం అయేసరికి కారు వొచ్చింది. మరో పది నిమిషాలలో మమత కూడా తయారయింది. అతను కొన్న చీర ఆమె కట్టుకోలేదు. కాని శ్రీధర్ ఏమీ అనలేదు.

కారులో కూర్చుని డ్రయివర్‌కి హోటల్ పేరు చెప్పేడు శ్రీధర్.

మమత అతని చేతిమీద చెయ్యివేసి నెమ్మదిగా నొక్కింది.

ఆ చేతిని తిరిగి నొక్కి ఒక నిమిషం అలాగే పట్టు పట్టుకున్నాడు శ్రీధర్. ముందుకి వొంగి డ్రయివర్‌తో "ముందు హోటల్‌కి కాదు. గాంధీనగర్‌కి వెళ్ళు" అని అడ్రస్ చెప్పేడు.

కారు మలుపు తిరిగింది. మరికొన్ని మలుపుల తరువాత ఒక చిన్న ఇంటి ముందు ఆగింది.

"కొంచెం అవతల పార్కు చెయ్యి. పది నిమిషాలలో వస్తాం" అన్నాడు శ్రీధర్. అతనూ మమతా కారు దిగారు. కిందని దారి అసహ్యంగా, బురదగా వుంది.

పాటాల ఇళ్లు. కొంచెం వాకబు చేసి శ్రీధర్ ఒక ఇంటి ముందు నిలబడ్డాడు. క్షణం ఆలోచించాడు. లోపల నుంచి పిల్లలగోల వినిపిస్తోంది. తలుపు తట్టేడు.

చిరంజీవి తలుపుతీసి వాళ్ళని చూసి ఆశ్చర్యపడ్డాడు.

అతని భార్య కాబోలు అతని వెనక నిలబడి "ఎవరూ?" అంది ఎండిపోయినచెట్టులాగ వుంది ఆవిడ.

"మా శ్రీధర్‌గారు!" అన్నాడు చిరంజీవి.

"అంటే — మీ పేకాటకి అప్పు ఇచ్చినాయనా?" అందామె.

"అవునులే —" అని, "లోపలికి రండి" అన్నాడు చిరంజీవి.

లోనికి రావటం ఈరోజు కాదులెండి — మీరు బట్టలు వేసుకురండి" అన్నాడు శ్రీధర్. మమత అతని వెనక్కి వెళ్ళి నిలబడింది. చిరంజీవి నిమిషంలో వొస్తానని అని లోపలికి వెళ్ళాడు. నలుగురు పిల్లలూ నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయారు.

"ఆ డబ్బు పేకాటలో తగలేసి వొచ్చారాయన— మళ్ళీ మీకు ముఖం చూపడం కుదరలేదు" అంది చిరంజీవి భార్య.

"అతను పేక ఆడతాడని తెలీదు" అన్నాడు శ్రీధర్.

"మహా పిచ్చి. ఒక ఏడాది పాటు మానేశారు — పిల్లల మీద వొట్టు వేసుకుని. మళ్ళీ మామూలే! కాని మీ బాకీ తీరుస్తారులెండి. ఆయన్ని ఏమీ అనొద్దు."

చిరంజీవి వొచ్చాడు. ముగ్గురూ కారు దగ్గరకి నడిచారు.

"కారు కొన్నారా? బాగుంది" అన్నాడు చిరంజీవి ముందు సీటులో కూర్చుని తలుపు వేసుకుంటూ.

కంపెనీది"

"అలాగా! అయినా మా పీతాంబరంగారి కారు లాంటిది ఉండకూడదు! అది మైలునడిస్తే నాలుగు మైళ్ళు తొయ్యవలసి వచ్చేది! ఇంతకీ ఎక్కడికి తీసుకెడుతున్నారు?"

"హోటల్‌కి"

"అలాగే అనుకున్నాను. మేనీ హేపీ రిటర్న్స్! సీతారాముల్లా వున్నారు మీరు. మీతో ఈ రోజు ఉండగలగడం నా అదృష్టం!" అన్నాడు చిరంజీవి.

డిన్నర్ టేబిల్ దగ్గరకూడా అతను ఏదో ఒకటి చెప్తూనే వున్నాడు. మమత అతన్ని బలవంతం చేసి చాలా తినిపించింది. డిన్నర్ ముగిసే సరికి పదిన్నర అయింది. అప్పటిదాకా అతను అప్పుమాట ఎత్తక పోవడం శ్రీధర్‌కీ, మమతకి చాలా సంతోషం కలిగించింది.

అతన్ని కారులో ఇంటి దగ్గర వొదిలారు.

"చాలా థాంక్స్ అన్నగారూ! ఏదో ఒకరోజున నేను మీ బాకీ తీరుస్తాను. అప్పటిదాకా కనిపించక పోతే ఏమీ అనుకోకండి" అని చేతులు జోడించి చిరంజీవి చాలా త్వరగా తన ఇంటికి వెళ్ళిపోయాడు. శ్రీధర్ కిటికీలోనించి తల బయటకి పెట్టి ఏదో అనబోయాడు. కాని మమత వేళ్ళు అతని వేళ్ళ చుట్టూ బిగుసుకోడంతో కారుని కదలమనిమాత్రం చెప్పేడు.

ఇంటికి వెళ్ళగానే మమత కొత్తచీర కట్టుకుంది.

ఆ రాత్రి మళ్ళీ వర్షం పడింది.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఎంతో సన్నిహితులయారు — చాలా కాలం తరువాత.

ఆ రాత్రి ఇద్దరే మనుషులు వాళ్ళు.

ఏకాంతంలో...... ★


దీపావళి సందర్భముగా మా డీలర్లకు, ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
ఇవే మా శుభాకాంక్షలు !!

భగవతారాధనకు
శ్రీదుర్గాదర్బార్ బత్తినే
ఎల్లప్పుడూ వాడండి!



మా ఇతర రకములు -
శ్రీదుర్గా అగరబత్తి, శ్రీదుర్గా జనరంజని బత్తి, ప్రేమాభిషేకం మల్లెపూవు
గ్రాస్ప్ అగరబత్తి
తయారుచేయువారు:
ఫోన్: 739 1001
శ్రీదుర్గా ఇండస్ట్రీస్ (రిజిష్టర్డ్)
ప్రొ: T.సుందరరామయ్య రామచంద్రరావుపేట, ఏలూరు